

# హెచ్‌ఎం, టీచర్‌పై చర్యలు తీసుకోండి

**ప్రజానావ, తాండూర్:** తాండూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, టీచర్ జ్యోతి తమను అకారణంగా వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆరుగురు మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసిల్దార్ వీవీఆర్కే ప్రసాద్ కు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డీ రాజారాం మాట్లాడుతూ తాండూర్ జడ్పీ పాఠశాలలో ఆరుగురు మధ్యాహ్న భోజన కార్మికులు 20 ఏండ్ల నుంచి మెనూ ప్రకారంగా సక్రమంగానే వంట వండి పిల్లలకు పెడుతున్నారని, కానీ, ఆ పాఠశాల హెచ్ఎం, టీచర్ మధ్యాహ్న భోజన కార్మికులను వేధిస్తున్నారన్నారు. వేధింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాద కారకుడిపై కేసు

**ప్రజానావ, తాండూర్:** రోడ్డు ప్రమాదం చేసి ఒకరి మృతి కారణమైన తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధి రేచిని గ్రామానికి చెందిన ఆడే భీమ్ రావుపై కేసు నమోదు చేసినట్టు తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్సై వివరా ల ప్రకారం.. అచ్చులాపూర్ పంచాయతీ పరిధి కొమ్ముగూడెం గ్రామానికి చెంది న పెరుగు రాజయ్య(57) ఈనెల 2న బైక్ నుంచి పెట్రోల్ బంకు వైపు వెళ్తుం డగా, రేచిని గ్రామానికి చెందిన భీమ్‌రావు రాంగ్ రూట్లో మోటార్ బైక్ పై వేగంగా వచ్చి, ఎదురుగా రాజయ్య బైక్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ రాజయ్యను మొదట మంచిర్యాలకు, అక్కడి నుంచి హైదరాబాద్‌నిమ్స్ హాస్పిటల్ కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాజయ్య మృతి చెందగా, భీమ్‌రావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

# రేచిని పంచాయతీ తనిఖీ

**ప్రజానావ, తాండూర్:** రేచిని గ్రామపంచాయతీని తాండూర్ మండల పంచాయతీ అధికారి జీ అనిల్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. శానిటేషన్, రికార్డులు, నర్సరీని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో నిర్మించే పశువుల పాకలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.








# ఉపాధి కోసం వెళ్లి జైలు పాలు

## మలేషియా జైలులో ఆరుగురు ఖానాపూర్ నియోజకవర్గవాసులు
## విడుదలకు కృషి చేస్తున్న బీఆర్ఎస్‌నియోజకవర్గ ఇన్‌చార్జి
## మలేషియాలలో అధికారులతో మాట్లాడుతున్న భూక్యా జాన్సన్
## ఆరుగురు విడుదలకు కృషి చేస్తానని కుటుంబీకులకు హామీ

**ప్రజానావ, ఖానాపూర్:** మలేషియా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖానాపూర్ నియోజకవర్గ వాసుల విడుదలకు తీవ్రంగా కృషి చేస్తునట్టు బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ తెలిపారు. ఉపాధి కోసం కడెం మండలం లింగాపూర్, దస్తురాబాద్ మూన్యాల్ గ్రామాలకు చెందిన ఆరుగురు మలేషియాకు వెళ్లారు. అనంతరం అక్కడ అకారణంగా జైలులో ఉన్నారని కుటుంబసభ్యులకు సమాచారం అందగా, వారు భూక్యా జాన్సన్ నాయక్ ను సంప్రదించారు. వారి విడుదలకు కృషి చేస్తానని జాన్సన్‌హామీ ఇచ్చారు. మలేషియాకు వెళ్లి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహాయంతో మలేషియా ఉన్నతాధికారులను సంప్రదించారు. కడెం మండలం లింగాపూర్ వసూలు రాచకొండ నరేష్, తలారి భాస్కర్, గురుజాల శంకర్, గురిజాల రాజేశ్వర్, గుండా శ్రీనివాస్, మూన్యల్ గ్రామం దస్తూరాబాద్ మండలానికి చెందిన యమునూరి రవీందర్‌అక్రమ ఆయుధ చట్టం కింద జైలులో ఉన్నారని తెలుసుకున్నారు. జైలులో ఉన్న వారందరినీ భూక్యా జాన్సన్ నాయక్ ములాఖాత్ అయి, ఓదార్చారు. వారి విడుదలకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. అనంతరం అధికారులతో మాట్లాడి ఉపాధి కోసం వారు మలేషియా వచ్చారని, ఎలాంటి నేరం చేయలేదని, అకారణంగా వీరు జైలులో మగ్గుతున్నారని, భారతదేశంలో వీరి కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని, తక్షణమే వీరి విడుదలకు సహాయ సహకారాలను అందించాలని అధికారులను కోరారు. అనంతరం జాన్సన్ నాయక్ సొంత నిధులతో వీరి విడుదలకు ప్రత్యేకంగా అక్కడి స్థానిక న్యాయవాదులను నియమించి, త్వరగా జైలు నుంచి విడుదలయ్యేలా చర్యలు చేపడుతున్నారు. ఆరుగురు విడుదలై ఇంటికి తిరిగి వచ్చే వరకు తన శాయశక్తుల కృషి చేస్తానని జాన్సన్ నాయక్ అన్నారు.





# లక్ష్య సాధనకు కృషి చేయాలి

## జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్



**ప్రజానావ, ఆసిఫాబాద్ టౌన్ :** బాలికలు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని అవి సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా మహిళా, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భేటీ బచావో-భేటీ పడావో దశాబ్ది ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే చదువులో రాణించాలని తెలిపారు. విద్యార్థినిలు యుక్త వయసు సమయంలో మరింత శుభ్రత పాటించాలని, శరీరం దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత ఉంటుందని, క్రీడారంగంలో సైతం రాణించాలని తెలిపారు. బాలికలను కాపాడుకోవడం, చదివించుకోవడం తో పాటు వారికి స్వేచ్ఛగా అన్ని రంగాలలో తోడ్పాటు అందించాలని తెలిపారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 10వ తేదీ వరకు జిల్లాలోని 40 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలలో ప్రత్యేక బృందం ద్వారా ప్రేరణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించే దిశగా ప్రజలందరూ స్వచ్ఛందంగా సహకరించాలని, బాలికల చదువు కుటుంబానికి, దేశానికి ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త శారద, ఎస్. ఓ. నలంద, సుండిల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరానికి భారీ స్పందన

**ప్రజానావ, బెజ్జూర్ :** మండల కేంద్రంలోని అటవీ క్షేత్ర కార్యాలయంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అటవీశాఖతో పాటు సింగరేణి కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరానికి బెజ్జూర్ మండలంతో పాటు పెంచికలపేట్, చింతలమానేపల్లి మండలాల్లోని సుమారు 30 గ్రామాల నుంచి 1,440 మంది ప్రజలు హాజరైనట్లు తెలిపారు. వీరికి సింగరేణి యాజమాన్యం వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించినట్లుగా తెలిపారు. మార్కుల గ్రామంలోని నిరుపేద ప్రజల సౌకర్యార్థం జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టేబ్రివాల్ ఆదేశాల మేరకు సింగరేణి యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



